# అత్యంత శక్తిమంతం అతిరుద్రం

ఆంగ్లభాషా మోహమావరించిననాడె
స్వమత విజ్ఞానంబు సన్నగిల్లె
స్వమత విజ్ఞానంబు సన్నగిల్లిననాడె
సంస్కార భావంబు సమసిపోయె
సంస్కార భావంబు సమసిపోయిననాడె
మానవతా విలువ మంటగలసె
మానవతా విలువ సమసిపోగానె
భారతీయోన్నతి భగ్నమయ్యె
కాన ఇప్పుడైన మీరలు కన్ను తెరచి
తెలివితో కాంచుడో భారతీయులార!
ఇంతకన్నను వేరెద్ది ఎఱుకపరతు?
సాధుసద్గుణ గణ్యులౌ సభ్యులార!

ఇది పుణ్యభూమి, త్యాగభూమి, పతివ్రతామతల్లులు జన్మించినటువంటి పవిత్ర భూమి.

గత జీవుడగు పతిన్ బ్రతికించుకొన్నట్టి
సావిత్రి భారత సతియె కాదె
తన సత్య మహిమచే దావాగ్ని చల్లార్చె
చంద్రమతి పవిత్ర పడతి కాదె
కుల సతీత్వమునకై గుండాన దూకిన
సీత భారత ధరా జాత గాదె

sri sathyasai vachanamrutam

**కినిసి దుర్మద కిరాతుని బూది గావించె**
**దమయంతి భారత రమణి గాదె**
**సత్యసాగర పరివేష్టితోర్వీతలము**
**భరతజాతి పాతివ్రత్య ప్రవిమలంబు**
**భావ సంపదకిది మహా పంటభూమి**
**అఖిల దేశాలకిది ఉపాధ్యాయి కాదె!**

మరణించిన పతిని బ్రతికించుకున్నటువంటి సతి ఇంకే దేశములోనైనా ఉన్నదేమో చూడండి. సీత క్షణమైనా ఆ రావణుని మొహం చూడలేదు; క్రిందికి వంచుకున్న తల పైకెత్తలేదు. అటువంటి పతివ్రతామతల్లులు జన్మించినటువంటి పుణ్యభూమి ఇది. మగవారియందు అట్టి ఉన్నత భావములు కలిగినటువంటివారు లేకపోయినను, భారతదేశంలో ప్రతి ఒక్క స్త్రీయందుకూడను ఆ పతివ్రతామ తల్లులయొక్క సత్యమైన భావము, నిత్యమైన ధర్మము హృదయములో నిండి వున్నాయి. పతి వచ్చినప్పటికీ తలుపు ఓరగా నుంచి మాట్లాడేటటువంటివారేగాని, ఎదురుగా వచ్చి మాట్లాడేవారు కారు, భారతీయ స్త్రీలు. శివుడు ఇట్టి పవిత్రమైనటువంటి భూమియందు పుట్టక ఇంకెక్కడ పుడతాడు!

కేవలం వ్రతములు, పూజలు, యజ్ఞయాగాది క్రతువులు సల్పినంత మాత్రమున భగవంతుడు మనకు ప్రత్యక్షం కాడు. హృదయ పవిత్రతచేతనే, సద్గుణములచేతనే భగవంతుని ప్రత్యక్షం గావించుకోవచ్చును. సృష్టియందు ఉన్నటువంటి సమస్త వస్తువులు, సమస్త జీవులుకూడను సృష్టి, స్థితి, లయ కారకుడైన భగవంతునినుండి ఉద్భవించినటువంటివే. ప్రతి పదార్థమూ భగవంతునియొక్క వరప్రసాదమే. ప్రతి వస్తువులోను దైవమున్నాడు. 'ఈశ్వర స్సర్వ భూతానాం', 'ఈశావాస్య మిదం సర్వం'. కనుక, మనం ఏ పదార్థమును చూసినప్పటికిని అది ఈశ్వర స్వరూపముగానే భావించాలి. (కర్చీఫ్‌ను చూపుతూ) 'ఇది వస్త్రము' అంటారు. కాని, ఇది వస్త్రము కాదు; దారములయొక్క చేరిక. అయితే, ఇది దారములయొక్క చేరికకూడా కాదు; ప్రత్తియొక్క స్వరూపమే. ప్రత్తిచేత

sri sathyasai vachanamrutam

దారము, దారములచేత వస్త్రము తయారవుతున్నాయి.

**దైవం ఇచ్చిన దేహాన్ని తిరిగి దైవానికే అర్పితం చేయాలి**

భగవంతునియొక్క తత్త్వమేమిటి? 'నిర్గుణం నిరంజనం సనాతనం నికేతనం నిత్య శుద్ధ బుద్ధ ముక్త నిర్మలస్వరూపిణం'. ఎవరికి తోచిన పేరు వారు పెడుతున్నారుగాని, భగవంతునికి ఒక పేరూ, ఒక రూపమూ లేవు. 'సర్వతః పాణి పాదం.' ఎక్కడ చూసినా ఉన్నది భగవంతుడే! కేవలం మానవ దేహాన్ని మీరు చూస్తున్నారు. ఇది నీటిబుడగవంటిది. మనస్సనేది bundle of desires (కోరికల మూట). ఇట్టి మనస్సును, అట్టి దేహాన్ని నమ్ముకొని మనం జీవించరాదు. దేహము భగవంతుడు ఇచ్చినటువంటి వరప్రసాదము. భగవంతుడిచ్చినటువంటి సర్వమునూ భగవంతునికే అర్పితం గావించే నిమిత్తమై మనము జన్మించినాము. కృష్ణుడు 'మమైవాంశో జీవలోకే జీవభూత స్సనాతనః'. 'మీరందరూ నా అంశములే', అన్నాడు. నీవు కేవలం మానవుడవు కావు. నీ పేరు నీకు తల్లిదండ్రులు పెట్టినది. పుట్టినప్పుడు ఎట్టి పేరూ లేదు నీకు. మానవత్వము దివ్యత్వముతోకూడినదేగాని, అపవిత్రమైనది కాదు. మానవత్వమునందు ఇట్టి పవిత్రమైన తత్త్వమును పోషించి మానవులను కాపాడే నిమిత్తమై దైవము అవతరిస్తుంటాడు. ఎప్పుడు ధర్మం క్షీణించునో అప్పుడు దైవం ఉద్భవిస్తుంటాడు.

**యదా యదా హి ధర్మస్య గ్లానిర్భవతి భారత**
**అభ్యుత్థాన మధర్మస్య తదాత్మానం సృజామ్యహం**

కనుక, భగవంతుడు అవతరించడం ధర్మోద్ధరణ నిమిత్తమే. ఈనాడు జగత్తులో ధర్మము క్షీణించింది, సత్యము కనుమరుగైంది. అన్యాయ, అక్రమ, అనాచారములతో జగత్తు నిండి ఉన్నది. భగవత్ విశ్వాసము ఒక్కటి మాత్రమే సత్యమైనది. Truth is God. Love is God. Live in love. ప్రేమలో జీవించాలి. ప్రేమయే లేకుండిన ప్రాణమే లేదు. ప్రేమకోసమే మనము భగవంతుని ప్రేమించాలి. ప్రేమచేతనే భగవంతుని పొందాలి.

**మానవుని స్థితి, గతులన్నీ వేదమునందే ఇమిడివున్నవి**

పండితులవారు చెప్పినట్లుగా అతిరుద్రమునందు అనేక నమక, చమకములు

sri sathyasai vachanamrutam

చేరివున్నాయి; మానవత్వాన్ని జీవింపజేస్తున్నాయి. ఇట్టి మహత్తరమైన శక్తులు ఎక్కడినుండి వచ్చాయి? కృష్ణ యజుర్వేదమునందు ఉన్నటువంటి నమక, చమకాలను తీసికొని, వీనిని పూర్తిగా ఏకీభవింపజేసి, తద్వారా అభిషేక మంత్రాలను ఏర్పరచారు. కృష్ణ యజుర్వేదమునందు ఉన్నటువంటి ఇట్టి మంత్రములు మరిదేనియందూ కానరావు. స్మృతి, శాస్త్ర, ఇతిహాస, పురాణము లన్నియు ఆ వేదసారమే. కాని, ఈనాడు వేదములన్నియు మరుగున పడిపోయినవి. కారణం ఏమిటి? వీటిని ఉచ్చరించేటటువంటి వ్యక్తులు లేక పోవడమే! నిజానికి వేదము సకలైశ్వర్య సంపన్నమైనది. దానికి మించినది మరొకటి లేదు. మానవుని యొక్క స్థితి, గతులన్నికూడను వేదమునందే ఇమిడి యున్నవి. సర్వులు ఉచ్చరించే నిమిత్తమై భగవంతుడు వేదముల ననుగ్రహించాడు. దీనికి జాతి, మత భేదములు ఏమాత్రము లేవు. (స్వామి ఇరువురు విదేశీ విద్యార్థులను వేదికపైకి పిలిచి వారిచేత శ్రీసూక్తము చెప్పించారు). ఈవిధముగా, ప్రతి దేశమునందు, ప్రతి మానవునికి వేదము తెలిపించాలన్నది స్వామి ఉద్దేశ్యం. ఇది కేవలం బ్రాహ్మణులకుగాని, భారత దేశానికిగాని పరిమితం కాదు. మొన్నటి దినము పుట్టపర్తికి ఇరాన్, ఇరాక్‌వారు వచ్చారు. ఇప్పుడుకూడా ఇరాన్‌వారు ఉన్నారిక్కడ. అందరికికూడను వేదాన్ని బోధిస్తున్నాము. వేదము సర్వ భేదములను నివారణ గావిస్తుంది. ఈ అతిరుద్ర మహాయజ్ఞము పుత్రకామేష్టి, అశ్వమేధ యాగములవంటిది కాదు. ఇది ప్రతి మానవునియొక్క ఉద్ధరణకోసమని, మానవకళ్యాణంకోసమని నిర్వహిస్తున్నాము. వేదము అందరికోసం ఉద్భవించినది. అదృష్టవంతులైనటువంటివారు దీనిని నేర్చుకొని ప్రచారము చేస్తున్నారు. దురదృష్టవంతులు వేదము తెలిసికూడను ఎవ్వరికీ బోధించడం లేదు. ఇప్పుడు మా సంస్థల్లో ప్రతి పిల్లవానికి వేదము నేర్పిస్తున్నారు. ఇందుకోసం మొట్టమొదట సంస్కృతము తెలుసుకోవాలి. మన వినయ్‌ని కర్ణాటక యూత్ లీడర్‌గా నియమించాము. అదేవిధముగనే, ఆంధ్ర, కేరళ మొదలైన అన్ని రాష్ట్రాలలో, అన్ని దేశాలలో మేము నియమించాము. వీరు యువజనులందరినీ చేర్చి వారందరికీ ఈ సత్యాన్ని నిరూపించాలి. (స్వామి విదేశీ విద్యార్థులచేత 'నమకం' చెప్పించారు)

**రుద్రమనగా సకల వేదసారమే!**



sri sathyasai vahini / vachanamrutam

ఈవిధముగా అన్ని దేశములవారుకూడను వేదము నేర్చుకుంటున్నారిప్పుడు. యజుర్వేద, సామవేద, అథర్వణ వేదములను, ప్రధానంగా ఋగ్వేదమును నేర్చుకుంటున్నారు. వేదములను మనము అలక్ష్యం చేయకూడదు. వేదములో సృష్టియొక్క రహస్యమంతా ఉంటున్నది. జీవిత లక్ష్యమును వేదం నిరూపిస్తున్నది. ఒక్కటి కాదు, సర్వమూ వేదమునందు ఉంటున్నది. బ్రహ్మచర్య, గృహస్థ, వానప్రస్థ, సన్యాస ఆశ్రమములు నాల్గింటియొక్క సత్యము వేదమునందు నిరూపించబడింది. ఇప్పుడు దీనిని అందరుకూడను అర్థం చేసుకుంటున్నారు. గ్రామాలలో ఉన్న స్త్రీలుకూడను వేదాలు చెబుతున్నారు. కేవలం దేహపరంగా ఆడ, మగ అనే వ్యత్యాసం ఉండవచ్చునుగాని, వేదము నభ్యసించడంలో ఎట్టి భేదములూ లేవు. వేదము చాలా విచిత్రమైనది, పవిత్రమైనది. అందులో అతిరుద్రం చాలా గొప్పది. దీంట్లో ఉన్నటువంటివి మరి దేనియందూ లేవు. రుద్రమనగా ఈశ్వరునియొక్క పేర్లు అనుకుంటారు. కాదు, కాదు. ఇది ఋగ్వేదము, యజుర్వేదము, సామవేదము, అథర్వణ వేదము - ఈ అన్ని వేదములయొక్క సారమే. అంతేకాకుండా, నమకము, చమకము ఈ రెండింటి యొక్క ఏకత్వమే దీనికి గొప్ప పటుత్వము. నమకము 'వద్దు' అంటుంది. చమకము 'కావాలి' అంటుంది. కాని, అన్నింటి యందున్న సారము ఒక్కటే. దేనిని వద్దంటుంది? చెడ్డను వద్దంటుంది. మంచిని కావాలంటుంది. కనుక, రెండు కూడను మనము నేర్చుకోవాలి. చమకము కోరికలతో నిండినటువంటిది. నమకము విరక్తితో నిండినటువంటిది. ఎవరు సన్యాసి? ఎవరు సన్యాసి కాడు? అని విచారణ చేస్తే, కామినీ శక్తికోసం ప్రయత్నం చేసేటటువంటివాడు సన్యాసి కాడు. కామినీ శక్తియొక్క ఫలమును కోరనటువంటివాడే నిజమైన త్యాగి. ఇల్లూ వాకిళ్లను, భూమిని, ధనమును త్యాగం చేస్తే, అదే నిజమైన త్యాగ మనుకుంటున్నారు. అది త్యాగమే కాదు. అది సులభంగా చేయవచ్చును. కామినీ ఫలములను విసర్జించాలి. Result of desires ను విసర్జించాలి. అదే నిజమైన త్యాగము.

**ఎడ్యుకేషన్ - ఎడ్యుకేర్**

మనము దేనికోసం పుట్టామనేది తెలుసుకోవాలి. మనము పుట్టింది తినటం, తిరగటం, సుఖాల ననుభవించటం... ఇందుకోసం కాదు. మన తోటి మానవులకు సహాయం చేసే

sri sathyasai vachanamrutam

నిమిత్తం పుట్టాము. Help ever, hurt never. ఎవ్వరినీ బాధించకూడదు. ఎట్టి కఠినమైనటువంటి వాక్కులూ చెప్పకూడదు. ఎవ్వరినికూడను దూషించకూడదు. పరదూషణ మహాపాపం. ఎటువంటి ద్వేషినైనను దూషించకూడదు. ఇలాంటి మంచి గుణములు మనలోనే దాగియున్నవి. దేహము పాంచభౌతికము; పంచేంద్రియాలతో కూడినది. ఈ ఇంద్రియాలన్నీ కోరికలతో కూడినటువంటివి. కాని, మనకు తెలియకుండా లోపల దాగినటువంటివి కొన్ని ఉన్నాయి. అవే సత్యము, ధర్మము, శాంతి, ప్రేమ, అహింస. వీనిని మనలోపలినుండి ఆవిర్భవింపజేసుకోవాలి. దీనినే 'ఎడ్యుకేర్' అన్నారు. ఈనాడు పుస్తకాలు చదివి నేర్చుకునే విద్యను 'ఎడ్యుకేషన్' అని అంటారు. ఈ 'ఎడ్యుకేషన్' కాదు మనము నేర్చుకోవలసింది. ఎవరో పుస్తకాల్లో రాసినటువంటి విషయాలను చదువుకొని నేర్చుకోవడం కేవలం 'ఎడ్యుకేషన్' మాత్రమే. ఎవ్వరూ చెప్పే అవసరం లేకుండా తనలో ఉన్న సద్గుణాలను ఉద్భవింప జేసుకొని పవిత్రమైన మార్గంలో ప్రవేశించడమే ఎడ్యుకేర్. అది భగవంతునియొక్క వరప్రసాదము. అది కేవలం భగవదనుగ్రహంచేతనే లభ్యమవుతుందిగాని, లేకుండిన లభ్యం కాదు.

**ఏకత్వాన్ని గుర్తించి దైవత్వాన్ని పూజించాలి**

మనము 'సర్వదా సర్వకాలేషు సర్వత్ర హరి చింతనం' చేస్తూ ఉండాలి. అదే నిజమైనటువంటి భక్తి. మనము ఈశ్వరుడన్నా, విష్ణువన్నా ఏ పేరు పెట్టి పిలిచినా పలికే దివ్యత్వం ఒక్కటే.

> **"శృంగారములు వేరు, బంగార మొక్కటే**
> **పశుల వన్నెలు వేరు, పాలు ఒకటే"**

అట్లనే, భగవంతుడు ఒక్కడే. 'అల్లా' అను, 'ఏసు' అను, 'రామా' అను, 'కృష్ణా' అను. ఏ పేరైనా పెట్టుకో. భగవంతుడు ఒక్కడే. ఇవన్నీ ఒకే భగవంతునియొక్క వేర్వేరు పేర్లు మాత్రమే. 'ఏకం సత్ విప్రాః బహుధా వదన్తి'. కనుక, మనము భగవంతుని విషయంలో భేదము పెట్టుకోకుండా ఉండాలి. భగవంతునియొక్క రహస్యాన్ని తెలుసుకోవాలంటే 'ఓపెన్ హార్ట్' కావాలి. నీకు ఏ పేరు ఇష్టమో అది నీవు తలుచుకో, తప్పులేదు. అంతేగాని, ఒక రూపనామాలను దూషించడం, మరొక రూపనామాలను పూజించడం చాలా తప్పు.

srisathyasaivachanamrutam

కొందరు 'నారాయణా' అంటే ఇష్టపడతారు. 'శివా' అంటే వారికి ఇష్టముండదు. ఇది చాలా తప్పు. ఈశ్వరుడు, నారాయణుడు ఇరువురూ చేరి ఒక్కటే. ఒకే దైవత్వాన్ని అనేక పేర్లతో పూజిస్తున్నాము. ఇట్టి ఏకత్వాన్ని గుర్తించి పూజించినవారికి తప్పక మానసిక శాంతి కల్గుతుంది. ఒక రూపాన్ని ద్వేషించి, మరొక రూపాన్ని ప్రేమిస్తే మన అభీష్టము నెరవేరదు. ఇది మంచిది కాదు. ఈ సత్యాన్ని కేవలం యూత్ మాత్రమే కాదు, అందరు కూడను గుర్తించి అనుసరించాలి. దైవత్వమే లోకాన్ని రక్షిస్తున్నది. భగవన్నామం 'ఆటమ్ బాంబు' కన్న అత్యంత శక్తిమంతమైనది. చెడ్డను శిక్షిస్తుంది, మంచిని పోషిస్తుంది. కనుక, దైవత్వాన్ని మనము పూజిస్తూ ఉంటే తప్పక లోకరక్షణ జరుగుతుంది. ఈ యజ్ఞాన్ని మనం లోకకల్యాణంకోసమని చేస్తున్నాము. ఈ మంత్రములలో చాలా ప్రధానమైన అంశమున్నది. అతి రుద్ర మహాయజ్ఞము పవిత్రమైన తత్త్వాన్ని పోషించి, దుష్టత్వాన్ని శిక్షించి లోకకల్యాణం గావిస్తుంది. దీనిని ఎవ్వరైనా చేయవచ్చును.

**ఆదర్శప్రాయుడైన యూత్ లీడర్**

ఈ యజ్ఞము నిమిత్తం ఇంత బియ్యమిస్తాము, లేక ఏదైనా పదార్థమిస్తాము, లేక ఫలములిస్తాము, లేక కూరగాయలిస్తాము అని ఎంతోమంది ముందుకు వచ్చారు. కాని, మన వినయ్‌కుమార్ ఎవ్వరివద్దనుండి ఏమీ తీసుకోలేదు. ఈ యజ్ఞము ఎంతో ఖర్చుతో కూడినది. అయినప్పటికీ అతను ఎవ్వరిదగ్గరనుండి ఏమీ పుచ్చుకోకుండా, తానొక్కడే ఒక్కడు స్వయంగా అన్నిచోట్లకు తిరుగుతూ, అన్నీ సేకరించాడు. కనుక, అలాంటి సేవాదళ్ లీడర్స్ ప్రతి రాష్ట్రంలోను తయారు కావాలి. వినయ్ కుమార్ చాలా గొప్ప సేవ చేస్తున్నాడు. నేనే ఎంతో మెచ్చుకున్నాను. ఎవరైనా ఏమైనా ఇస్తామని ముందుకు వచ్చినా కూడా 'వద్దు, వద్దు. నాకు సాయి ఉన్నాడు. సాయే నాకు సహాయం' అంటూ వచ్చాడు. అతనికి వివాహమై పది సంవత్సరములైంది. భార్యాభర్తలు ఇద్దరుకూడను ఆధ్యాత్మిక మార్గములో ఉన్నారు. 'ఏమ్మా, ఇప్పుడు యజ్ఞము చేస్తున్నారు. కుమారుడు కావాలా?' అని అడిగితే, 'మాకు వద్దు స్వామీ', అన్నారు. 'మరి ఏమి కావాలి?' అని అడిగితే 'మీరే కావాలి' అన్నారు. ఈవిధమైన పలుకులు ఏ దంపతుల వద్దనుండికూడా నేను వినలేదు. చాలా ప్రేమతో, సహృదయంతో చాలా మంచి కార్యాలు చేస్తున్నాడు, వినయ్ కుమార్. అతని తండ్రి ఇన్‌కమ్ ట్యాక్స్

srisathyasaivachanamrutam

కమీషనర్. అతడు లక్ష్మీ నారాయణతో కలిసి పనిచేశాడు. ఇప్పుడుకూడను మన వినయ్ లక్ష్మీనారాయణతోనే చేరి వున్నాడు. ఆయనను తన తండ్రి మాదిరి చూసుకుంటున్నాడు. ఇలాంటి వ్యక్తులు, ఇలాంటి యువకులు జగద్వ్యాప్తి కావాలి. లీడర్లు మంచిగా ఉన్నప్పుడే ప్రపంచమంతా సరిగా ఉంటుంది. లీడర్లు మంచిగా లేకపోవడంచేతనే ఈనాడు ప్రపంచానికి ఈ గతి పట్టింది.

**సేవలోనే మీకు స్వామి అనుగ్రహం లభిస్తుంది**

విద్యారంగమునందుగాని, రాజకీయరంగమునందుగాని, ధార్మిక, ఆధ్యాత్మిక రంగములయందు గాని అన్నిటియందుకూడను మంచి లీడర్లు కావాలి. కాని, ఈనాడు మంచి లీడర్లు చాలా అరుదుగా కనిపిస్తున్నారు. ఎక్కడ పోయినా డబ్బు, డబ్బు, డబ్బు! అంతా వ్యాపారమే! కాని, మా సంస్థలలో అలాంటి అవస్థలు లేవు. అన్నీ ఫ్రీ! ఎడ్యుకేషన్ ఫస్టు క్లాసునుండి పిహెచ్.డి. వరకు అంతా ఉచితమే! మా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులుగాని, జనరల్ ఆసుపత్రులుగాని ఫ్రీగా వైద్యసేవలు అందిస్తున్నాయి. బయట ఒక హార్టుకు ఆపరేషన్ చేయాలంటే మూడు, నాలుగు లక్షలు కావాలంటారు. పేదవారు అంత డబ్బు ఎక్కడి నుండి తీసుకురాగలరు! వారికి చేతకాదు. వారికి ఫ్రీగా సేవ చేస్తున్నాము. కట్టుబట్టలతో వచ్చి చేరి, క్రొత్త బట్టలతో తిరిగి వెళుతున్నారు. అందరికీ మనము ఫ్రీగా సర్వీసు చేయాలి. మన సేవాదళమువారంతాకూడను, మన కాలేజీ పిల్లలుకూడను సమాజానికి ఫ్రీ సర్వీసు చేయాలి. దాంట్లోనే స్వామియొక్క అనుగ్రహము మీకు లభిస్తుంది. దేనిని మరచినప్పటికీ భగవన్నామాన్ని మాత్రము మరువకూడదు.

ప్రేమస్వరూపులారా! అతిరుద్ర మహాయజ్ఞమనేది ఉత్తమమైనది, పవిత్రమైనది, అత్యంత శ్రేష్ఠమైనది. కనుక, దీనిని చేసినటువంటివారు చాలా ధన్యు లవుతారు. మొత్తం పదకొండు హోమగుండము లున్నాయి. ఒక్కొక్క హోమగుండమువద్ద పదకొండుమంది చొప్పున ఋత్విక్కులు చేరుతుంటారు. కనుకనే, హోమగుండములవద్ద మొత్తం 121 మంది ఋత్విక్కు లున్నారు. యజ్ఞానికి సంబంధించిన అన్ని విషయాలను చూసుకోవడానికి ఒక్కొక్క హోమ గుండమునకు ఒక్కొక్క యజమాని ఉంటాడు. అందరూ కలసి ఐకమత్యంగా చేస్తారు. ఐకమత్యము చేతనే మనము ఎంతైనా సాధించవచ్చును. యూనిటీ నుండి మనకు



srisathyasaivachanamrutam

ప్యూరిటీ వస్తుంది. ప్యూరిటీనుండే డివినిటీ ఆవిర్భవిస్తుంది. కనుక, మనము పరస్పరం అన్నదమ్ములవలె, అక్కచెల్లెళ్ళవలె మెలగాలి. ఒకవేళ ఎప్పుడైనా కోపం వస్తే, 'ఇది నా శత్రువు' అని గ్రహించి దానిని తక్షణమే దూరం చేసుకోవాలి. కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యములు ఈ ఆరు కూడను మానవుణ్ణి హింసించేటటువంటి శత్రువులు.

దివ్యాత్మస్వరూపులారా! మీరందరూ సామాన్య మానవులు కారు. కేవలం గుర్తుకోసం ఒక్కొక్క రూపానికి ఒక్కొక్క పేరు పెట్టుకున్నారేగాని, అందరు కూడను ఆత్మస్వరూపులే! అందరూ క్షేమంగా, ఆనందంగా, సుఖంగా, సంతోషంగా జీవింతురు గాక! నిజముగా భక్తియే లేకపోతే మీకు శాంతి లభించదు. కాబట్టి, మీరు భక్తిని అభివృద్ధిపరచుకోవాలి బంగారూ! మీరు 'డివోషన్' (భక్తి)లో ఉండాలిగాని, 'డీప్ ఓషన్' (భవసాగరం) లో కాదు. ఈ 'డివోషనే' మిమ్మల్ని 'డివైన్' (దివ్యత్వం) చెంతకు చేరుస్తుంది.

**(తేదీ 09.08.2006, అతిరుద్ర మహాయజ్ఞం, సాయికుల్వంత్ సభామండపం)**

sri sathyasai vachanamrutam